క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



హోమంలో పాల్గొన్న భక్తులు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న ఆలయానికి పూజారులు భూమి పూజ నిర్వహించారు. దంపతులచే హోమం చేయించారు.

ఇంటర్ పరీక్షలు తనిఖీ

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల కేంద్రంలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షను జిల్లా నోడల్ అధికారి సులోచనారాణి తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న గదులను పరిశీలించారు. ఆమె వెంట కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు ఉన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

ఇల్లెందు: దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బీసీలు సంఘటితం కావాలని, సామాజిక న్యాయం కోసం పోరాడాలని జై భారత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిమిశెట్టి వీరన్న అన్నారు. శనివారం ఇల్లెందులో బీసీ సంఘాల ప్రతినిధులు సమావేశమై ఈ నెల 26న సంగారెడ్డిలో జరగనున్న బీసీ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఆవునూరి గణేష్, బంటు ఐలయ్య, డాక్టర్ సత్యనారాయణ, గట్ల అశోక్, వాడపల్లి భాస్కర్, దాస్యం సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'స్వేచ్ఛ' జేఏసీ జిల్లా కన్వీనర్‌గా రాజు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం స్వేచ్ఛ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా లాయర్ కూటం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ జీడీ సారయ్య ప్రకటించారు. శనివారం కొత్తగూడెంలోని జిల్లా సీపీఎం కార్యాలయంలో స్వేచ్ఛ జేఏసీ సమావేశం జరిగింది. సారయ్య మాట్లాడుతూ.. భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం ఆర్టికల్ 9(1) ద్వారా కల్పించిన హక్కును కాపాడుకోవటం కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయటం కోసం ఏర్పడిందేనన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రమేష్‌కుమార్ మక్కడ్, లాయర్ అసోషియేషన్ నాయకులు మారపాక రమేష్, పీడీఎస్‌యూ నాయకులు పృథ్వీ, సంధ్య, శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చార్వాక, ఎట్టి ప్రశాంత్, సత్యనారాయణ, కోనపాటి శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, కంచర్ల కామేశ్వరరావు, దోనేటి నగేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న వీఓఏలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో రెండురోజుల పాటు సమ్మె నిర్వహించిన వీఓఏలు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్‌వీ రమ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా కోశాధికారి జి.పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులు వీరన్న, సత్య, వీఓఏల సంఘం జిల్లా నాయకులు శ్రీను, గోపాల్, వెంకటేశ్వర్లు, చంద్రలీల, రేష్మ, వసంత, రాజమణి, మాధవి, రమేష్, మైమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన బల్లెం మోతీరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం గ్రామపంచాయతీ సర్పంచ్ గద్దల రమేష్ ఆయనను పరామర్శించి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

షడ్రుచుల సంగమం.. ఉగాది

- 22న శ్రీ శోభకృత్ నామ సంవత్సరం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు



సండే స్పెషల్

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందురూరల్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో పూజలు, పంచాంగశ్రవణ కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఏడాది కూడా 22వ తేదీన చైత్ర శుక్ల పాడ్యమి రోజున ఉగాది పండుగను ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. వసంతకాలంలో ప్రకృతిలో నూతనోత్తేజం, చైతన్యం మొదలై ప్రకృతి పచ్చగా చివురించడం శుభసూచకంగా పరిగణిస్తూ ఉగాది పర్వదినం జరుపుకుంటారు. అందుకే కొత్త జీవితానికి నాందిగా కూడా ఉగాదిని జరుపుకుంటారు. ఉగాది పండగకు ప్రత్యేకం ఉగాది పచ్చడి, రెండోది పంచాంగ శ్రవణం. ప్రతి ఇంటా ఉగాది పచ్చడి చేసి ఇంటిల్లిపాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించే ఆనవాయితీ ఉంది. తెలుగు సంవత్సరం మొదలు రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని వినిపిస్తారు.

ఉగాది పచ్చడి విశిష్టత...

ఉగాది అంటే సృష్టి ఆరంభమైన రోజుగా పురాణాలలో ఉంది. ఈ పండుగ రోజున ప్రతి ఇంట్లో శుభచిహ్నంగా భావించే మామిడి తోరణాలను ఇంటి గుమ్మాలకు అలంకరిస్తారు. కొత్త పనులు చేపట్టాలనుకునే వారు ఉగాది నాడే శుభారంభం చేస్తారు. పండుగ ప్రత్యేకమైన ఉగాది పచ్చడిని తీసుకొని దినచర్యను ప్రారంభిస్తారు. బెల్లం తీపి ఆనందానికి ప్రతీకగా, ఉప్పు జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతికంగా, వేపపువ్వు చేదు బాధలను కలిగించే అనుభవాలను, చింతపండు పులుసు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులను, పచ్చి మామిడి ముక్కలు వగరు, కొత్త సవాళ్లకు ప్రతీకగా, కారం సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులను సూచిస్తుందంటున్నారు. అందుకే ఉగాది రోజు షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడిని ప్రతిఇంట్లో చేస్తారు.

చైత్ర శుక్ల పాడ్యమినాడే ఎందుకంటే..

వసంత మాసంలో వచ్చే ఈ పండుగకు ప్రకృతికి అవినాభావ సంబంధం ఉంటుంది. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమినాడే అంటే ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణాలలో ఉంది.

ఈ రోజునే బ్రహ్మ సృష్టిని సృష్టించాడని బలంగా విశ్వసిస్తారు. ప్రభావ నామ ఉగాదితో బ్రహ్మకల్పం మొదలై నేటికీ కొనసాగుతూనే ఉంది.

శ్రీ శోభకృత్ అంటే..

కాలగమనంలో 60 సంవత్సరాలు తెలుగు సంవత్సరాలుగా ఉన్నాయి. ఈ నెల 22న బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం మొదలుకానుంది. శోభకృత అంటే అందరి జీవితాలలో వెలుగును నింపేది అని, ఉద్యాన వనాలన్నీ పూలశోభతో కళకళలాడుతూ ఉండే సంవత్సరం అని అర్థం.

తెలుగువారికి ఇష్టమైన పండుగ



తెలుగు వారందరూ ఇష్టంగా జరుపుకునే తొలి పండుగ ఉగాది. ఈ పండుగ రోజున ఆలయ దర్శనం చేయడం, పెద్దలు, గురువుల ఆశీర్వాదం తీసుకోవడం వల్ల పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఉగాది పచ్చడి ఆచారంతో పాటు ఆరోగ్యపరంగానూ మేలు చేస్తుంది.
– జిల్లోజు రామాచార్యులు, అర్చక, పురోహితుల సంఘం జిల్లా కార్యదర్శి

కొత్త జీవితానికి నాంది..



ఉగాది పండుగ తెలుగు వారికి అత్యంత పవిత్రమైన పండుగ. ఈ పండుగ రోజునే కొత్తదనాన్ని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. సకల జనులు సైతం ఈ పర్వదినం నుంచి కొత్త పనులు ప్రారంభిస్తుంటారు.
– విక్రమాచార్యులు, అర్చక, పురోహిత సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

కనీస వేతన చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం, చట్టబద్ధ హక్కుల అమలు కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లిలో జరిగిన హమాలీ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులు హమాలీ రంగంలో పని చేస్తున్నారని చదువుకున్న వారికి ఉద్యోగం రాక, ఉపాధి లేక రెక్కల కష్టాన్ని నమ్ముకుని పని చేస్తున్న హమాలీ కార్మికులకు కనీస వేతనాల చట్టం, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు లేవన్నారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చట్టబద్ధ హక్కులు కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని, 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ అందించాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2, 3 తేదీలలో కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయూ 2వ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంచా, నాగేశ్వరరావు, వెంకన్న, శంకర్, సుధాకర్, చంద్రు, రాజ్యు, ప్రసాద్, శంభులింగం తదితరులు పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా ఈనెల 20న సోమవారం ఉదయం రుద్రహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 6303408458లో సంప్రదించాలని కోరారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

ఇల్లెందు: పట్టణంలో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ భూములలో చేపట్టిన గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణ జీఓ నంబర్ 76కు అర్హులైన వారు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో 2014 వరకు పన్ను కడుతున్న వారికి అనుమతి ఇచ్చిందని కేబినెట్ చర్చించి ఇప్పుడు మరో అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న భూముల క్రమబద్ధీకరణ జీఓ 58, 59 గడువును రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల పాటు పొడిగించినట్లు తహసీల్దార్ రంగాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: డబ్బుల విషయంలో తలెత్తిన వివాదంలో ఒకరిపై ముగ్గురు దాడి చేసిన సంఘటన మండలంలోని నెహ్రూనగర్‌లో శనివారం జరిగింది. నెహ్రూనగర్ తండాకు చెందిన భీమ్లాను అదే తండాకు చెందిన భద్యా, సంతోష్, బుజ్జిలు దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు సీఐ బి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలను శనివారం 1968 బ్యాచ్ విద్యార్థులు సందర్శించారు. గతంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జెవీవీ ప్రసాద్ ఇచ్చిన హామీ మేరకు పూర్వ విద్యార్థులు, కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సుమారు రూ.1లక్ష వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఆర్‌ఓ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను కలిసిన స్థానిక వార్డు కౌన్సిలర్ బండారి రుక్మాంగధర్ మాట్లాడుతూ.. తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని, పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, పూర్వ విద్యార్థులు రిటైర్డ్ తహసీల్దార్ ఎం.శ్రీహరి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జేవీవీ ప్రసాద్, రిటైర్డ్ హెచ్‌ఎం సర్వోత్తమరావు రాజేందర్, రాజేశ్వరరావు, రాజనర్సు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

పాల్వంచ: ఈనెల 25, 26, 27 తేదీల్లో మంచిర్యాలలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని మణుగూరు ఏరియా కార్యదర్శి గొని నాగేశ్వరరావు అన్నారు. శనివారం పాల్వంచ నటరాజ్ సెంటర్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఐఎఫ్‌టీయూ కార్మికుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి హక్కులకై కొట్లాడి విజయాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. నరేంద్ర మోదీ కార్మిక కట్టాలను నిర్వీర్యం చేసే విధంగా కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వీరమల్ల మల్లయ్య, ఉమ, అఫ్జల్ ఖాన్, సుధీర్, రాము, వెంకన్న, సోము, సాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



సుజాతనగర్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



చుంచుపల్లి: బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎడవల్లి కృష్ణ



ఇల్లెందురూరల్: పూజలు నిర్వహిస్తున్న బంజారా పూజారులు

చుంచుపల్లి: రాంపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజాక్, అచ్చా నాగమణి, అచ్చా నాగరాజు, కట్టా సంతోష్, కట్టా నరసింహారావు పాల్గొన్నారు. అదేవిధంగా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి రూ.10 వేలు విరాళంగా అందించారు. బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, శ్రీనివాస్, ముత్యాలరావు పాల్గొన్నారు.

సుజాతనగర్: డేగలమడుగు గ్రామంలో నాభిశిల (బొడ్రాయి), ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. పూజా కార్యక్రమాలను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం, ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బంధువులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున రావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, శివాలయం కమిటీ చైర్మన్ అన్నవరపు శ్యాంసుందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, గాజుల సీతారామయ్య, పెద్దమళ్ల నరేంద్రకుమార్, చేతుల పరమయ్య, మండె శ్రీను పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని రాజీవ్‌నగర్ తండా శివారు అటవీ ప్రాంతంలో సంత్ సేవాలాల్ కొలువుదీరిన ప్రాంగణంలో జగదాంబదేవి (మేరామా భవాని) విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బంజారాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు సంత్‌సేవాలాల్ ఆలయంలో పూజా చేశారు.

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంత్ సేవాలాల్‌కు భోగ్ బండారో నిర్వహించారు.

ఎమ్మెల్యే హరిప్రియ విస్తృత పర్యటన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శనివారం టేకులపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంగళితండాలో ఎమ్మెల్యేకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. హనుమా తండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి రిషిక ఇంటికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. టేకులపల్లి సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసప్తగిరి ఫ్యాన్సీ స్టోర్‌ను ప్రారంభించారు. తూర్పుగూడెంలో జార సమ్మయ్య కుమారుడి వివాహ శుభకార్యంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సింగ్యాతండాలో భూక్యా హరిలాల్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచ్ బోడ సరిత, ఎంపీటీసీ భూక్యా బాలకృష్ణ, మండల అధ్యక్షుడు బి.వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు, రామ, కిషన్, రాకేష్, శివ, బసవయ్య, రవి, సీఐ ఏలేటి ఇంద్ర సేనారెడ్డి, ఎస్ఐ గనరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బిల్లుల కోసం ఏడాదిగా ఎదురుచూపు



మాట్లాడుతున్న హరిలాల్ నాయక్

టేకులపల్లి: ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి సమర్పించి సంవత్సరం కావొస్తున్నా నేటికీ ఆ బిల్లులు మంజూరు కాకపోవడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కోయగూడెంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురై ప్రైవేట్ రిఫరల్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొంది మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద బిల్లులు సమర్పించుకోవడం జరిగిందని, అయినా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం గర్హనీయమన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎంప్లాయి హెల్త్ స్కీం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందకపోవడంతో వారు అందుబాటులోని రిఫరల్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది బిల్లులు సమర్పిస్తే మంజూరులో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈపీ రాజు, బి.సైదులు, ఎం.శారద, బి.కస్నా, సీహెచ్ వీరన్న, బినాగేశ్వర్‌రావు, టి.హరిలాల్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: నిరుపేద ప్రజల కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం కోసం ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లరేషన్ కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసి ఉన్న ప్రతిఒక్కరూ స్కీమ్‌కు అర్హులేనన్నారు. ఈ స్కీమ్ ద్వారా అర్హత పొందినవారు దేశంలో ఏ ప్రాంతంలోనైనా కార్పొరేట్ వైద్యం ఉచితంగా చేయించుకోనే అవకాశం ఉందన్నారు. స్కీమ్ మీద ప్రజలకు అవగాహన లేకపోవడం వలన దరఖాస్తులు చేసుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు ఈ స్కీమ్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మాలోతు ప్రశాంత్‌నాయక్, మాదారపు లక్ష్మణ్, బత్తుల వెంకటేశ్వర్లు, గుండు రాజు, హాతిరామ్, విజయ్‌కుమార్, సురేందర్, ఖమూరుద్దీన్, రేఖల ప్రభాకర్, నరేందర్, అశోక్, శేఖర్, భాను పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుగా ప్రకటించాలి



సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ అనుదీప్‌కు ఐడీఓసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్కే ఉమర్, జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్ మాట్లాడుతూ.. వర్షాలు, ఈదురు గాలులకు జిల్లాలో వేల ఎకరాలలో పంటనష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న, పత్తి, మిర్చి తదితర పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర సర్వే జరిపి ఆదుకోవాలని కోరారు.

పాల్వంచరూరల్: రెండురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలను ప్రకృతి విపత్తుగా గుర్తించి పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పాండురంగాపురం, నాగారం, నారాయణరావుపేట, దంతలబోరు, పునుకుల గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కురుస్తున్న అకాల వర్షాలకు మిర్చి, మొక్కజొన్న పంటలు చేతికివచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించిన కొత్తగూడెం రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జిల్లా సమాచార హక్కు చట్టం కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు జూలూరి రఘుమాచారి ఆధ్వర్యంలో తహసీల్దారు శర్మకు వినతిపత్రం అందజేశారు. రఘుమాచారి మాట్లాడుతూ.. జీఓ-76 కింద గతవారం నుంచి క్రమబద్ధీకరణ పట్టాల రిజిస్ట్రేషన్ల విషయంలో రెవెన్యూ అధికారి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అదనంగా డబ్బులు వసూళ్లు చేయడం సరికాదన్నారు. పట్టాల రిజిస్ట్రేషన్‌కు రూ.550 చెల్లించాల్సి ఉండగా, రెవెన్యూ అధికారి లక్ష్మీనారాయణ రూ.1000 పేదల నుంచి వసూళ్లు చేస్తున్నాడని ఆరోపించారు. వారం రోజుల నుంచి వందల మంది దగ్గర తీసుకున్న నగదుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు చిట్టిమల్ల చంద్రశేఖరచారి, దింగరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

మొర్రేడు బ్రిడ్జిపై అంధకారం

కొత్తగూడెం-లక్ష్మీదేవిపల్లి మొర్రేడు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో ఆ ప్రాంతమంతా అంధకారంగా మారుతుంది. ఇటీవల గ్రామపంచాయతీ అధికారులు బ్రిడ్జిపై సెంట్రల్ లైటింగ్‌ను అమర్చారు కానీ, నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ మార్గం గుండా రాత్రిపూట వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతుంటాయి. వీధిలైట్లు పనిచేయకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. – చుంచుపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : మన్నే శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి
సెల్ నంబర్ : 9948094142